
# రక్షణ

సత్యప్రియ




ఎలక్ట్రిక్ ట్రెయిన్ పెద్ద పెట్టున కూతపెడుతూ ఆగిందో స్టేషన్లో.

అంతవరకు ఎడారిలా వున్న ఆ మహానగరపు స్టేషన్ ప్లాట్‌ఫాం ఒక్కసారిగా జన సందోహంతో నిండిపోయింది.

రోజూ వచ్చే రైలే అది గానీ ఆరోజు దానికో ప్రత్యేకత ఆపాదించబడింది, మంత్రుల రాకతో... అధికారుల హడావిడితో...

ముందుగా అనుకున్నట్టుగానే ఓ కంపార్ట్ మెంటు వారి ముందు ఆగింది. మంత్రులు పూలమాలలతో నిలబడి వున్నారు, దిగేవారికి స్వాగతం చెప్పడానికా అన్నట్లు.

ఆ రైలులో వస్తున్నది... ప్రధానమంత్రీ, రాష్ట్రపతి కాదు... రాష్ట్రముఖ్యమంత్రీ కాదు... విజేతలై విదేశం నుంచి ఆ ఊరికి తిరిగి వస్తున్న క్రికెట్ ప్లేయర్లూ కాదు, ఆస్కార్ గెలిచి వచ్చిన సినీనాయకుడసలేకాదు.

రాగిణీదేవి రైలు దిగింది. ఆ కంపార్ట్‌మెంటు లోంచి ఆమె వెనుకనే ఓ నలుగురమ్మాయిలూ దిగారు.

రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖామంత్రిణి, తన చేతిలోని దండని రాగిణీదేవి మెడలో వేసారు. హర్షధ్వానాలు మిన్నుముట్టాయి. మంత్రిణి చిరునవ్వుతో రాగిణీదేవి వెనుకవున్న నలుగురు యువతులని పలకరించింది. ఫొటోగ్రాఫర్లు తమ కెమెరాలలో ఆ దృశ్యాన్ని బంధిరించారు. మర్నాడు పేపర్లలో మొదటి పేజీ న్యూసాయె అది.

"ఈ రాగిణీదేవిగారు ఎవరో మీకందరికీ తెలుసు. ఓ ప్రముఖ పారిశ్రామికవేత్త భార్యగానే కాక సుప్రసిద్ధ సంఘసేవాపరాయణురాలిగా కూడా మీకందరికీ ఆమె పరిచితమే. ఆమె యిన్నాళ్లూ చేసిన సేవ ఒక ఎత్తు... ఇవాళ సాధించినది మరో ఎత్తు. ఇది వెలకట్టలేనిది... మానవత్వంతో ఆమె చేపట్టిన ఈ కార్యక్రమం ఆమెని మానవులలో మహనీయురాలిని చేసింది. ఘనత వహించిన మన ముఖ్యమంత్రిగారి అధ్వర్యంలో రాష్ట్రప్రభుత్వం ఎన్ని సంక్షేమ కార్యక్రమాలని చేపట్టిందీ మీకందరికీ తెలిసిన విషయమే. ఇప్పుడు మన రాష్ట్రం నుండి మాయోపాయంతో తరలించబడ్డ అభాగినుల సంక్షేమానికి మన మహత్తర నాయక శిరోమణి ముఖ్యమంత్రిగారి అధ్వర్యంలో సంక్షేమ కార్యకలాపాలు చేపట్టింది. అందుకు రాగిణీదేవిగారి వంటి సంఘసేవ దురంధురాలి మద్దతు... స్వయంగా ఆమె రంగంలోకి దిగి ఈ కార్యంలో పాలుపంచుకోడం మనం గర్వించదగ్గ విషయం. యావత్ మానవకోటి ఇలాంటి సేవపరాయణులకు రుణపడివుంది. ఈ నలుగురు యువతుల రక్షణ – ఈ సంక్షేమ కార్యక్రమంలో తొలిమెట్టు మాత్రమే" ఇలా కొనసాగింది మంత్రిణి ఉపన్యాసం.

ఈలోగా మరో రైలు వచ్చింది. అందులోంచి మరి కొంతమంది దిగారు, యామినీదేవి నాయకత్వంలో... వారూ ఆ ప్లాట్‌ఫాంకే రావడంతో మంత్రిగారి దృష్టి అటు తిరిగింది. రాగిణీదేవి యామినీదేవిని చూడగానే మూతివిరిచి, మంత్రిగారి వద్ద సెలవు తీసుకుని, మళ్లీ కలుస్తానని ఆ నలుగురు యువతులకు చెప్పి వెళ్లిపోయింది.

యామినీదేవిని కూడా కాస్సేపు పొగిడి దండలు, ఫోటోల కార్యక్రమం అయ్యాక, మంత్రిగారు తమ సహచర, అనుచరులతో వెళ్లిపోయారు. రెండు రైళ్లనుంచి వచ్చిన యువతులు సంక్షేమశాఖ అధికారుల పాలబడ్డారు.

రాగిణీదేవితో వచ్చిన నలుగురూ – రమ్య, రమణి, విమల, సుజాత.

యామినీదేవితో వచ్చిన వారు నలభైమందికి పైగానే వున్నారు. అందరి మొహాల్లో ఏదో పొగొట్టుకున్న దిగులు... భయం... 'సభ్య' సమాజంపట్ల బెరుకు. అయితే వీరిలో కొందరిలో నిర్లక్ష్యవైఖరి కనిపిస్తోంది. అధికారులలో ఏ ఒకరిద్దరిలోనో జాలి తొంగిచూస్తోంది, తప్ప, తతిమ్మా వారిలో ఏహ్యాభావం, లాలసత్వం తొంగి చూస్తున్నాయి.

రమ్య, రమణి, విమల, సుజాతలతోపాటు - తతిమ్మా నలభైమందికీ ఊరవతల ఒక తాత్కాలిక

చిట్టికథల పోటీలో రూ. 150 బహుమతి పొందిన కథ

బస ఏర్పాటు చేశారు. పత్రికలు - దేశంలో తొలిసారిగా ఒక రాష్ట్రప్రభుత్వం చేపట్టిన ఈ మహత్తర సంక్షేమ కార్యక్రమం గురించి హోరెత్తించాయి. జనం తండోపతండాలుగా ఆ ప్రాంతానికి వెళ్లివారిని చూడ్డం ప్రారంభించారు. బీడుపడిన ఆ ప్రాంతం యిప్పుడు ఒక వినోద యాత్రాస్థలమైంది. ఆ శిబిరంలో - నిర్లక్ష్యవైఖరి ప్రదర్శించిన అమ్మాయిలకి కూడా ఈ స్థితి కంటకప్రాయమైంది. వారికి వైద్య పరీక్షలు తదితరాలు జరిగాయి. ఓ వారం రోజులు గడిచేసరికి ప్రభుత్వ యంత్రాంగానికి వీరి మీద ఉత్సాహం నశించింది. అన్ని పత్రికలూ ఫోటోలు ప్రచురించి, తమ గురించి రాసి, ఆ వేడి తగ్గడంతో రాగిణీదేవి, యామినీదేవి కూడా ఆ ప్రాంతానికి రావడం మానేశారు. వస్తే అడపాదడపా వచ్చే విలేకరులు "వీళ్లనేం చేస్తారు... వీరి ఆలనా పాలనా మీ మహిళామండలి చూసుకుంటుందా?" అని అడగడం మరి వారికి యిబ్బందికరంగా వుండాయె.

"వారి తలిదండ్రులుగానీ, వారి బంధువులెవరైనాగానీ వస్తే వప్పగిస్తాం... లేదా విజిలెన్స్ హోమ్స్‌లో వుంచి వారి సంరక్షణభారం వహిస్తాం" అని ప్రకటించారు ప్రభుత్వంవారు.

అంతే... అప్పట్నించి ప్రారంభమయ్యాయి రమ్య, సుజాత తదితరుల కష్టాలు. ఆ బృందంలో అందంగా, ఆకర్షణీయంగా వుండే రమ్య, సుజాతల తలిదండ్రులమని చెప్పి ఓ నలుగురైదుగురు వచ్చారు.

"అక్కా ... నాకెందుకో భయంగా వుందే - వీళ్లెవరూ నాకు తెలియదు... ఎవరితోనైనా పంపించేసి చేతులు దులుపుకునేట్లు వున్నారు ఈ అధికారులు" అంది రమ్య, రమణితో.

"అక్కా... ఆ అధికారి అయితే బంట్రోతుని పంపించి, తను చెప్పినట్లు వినకపోతే, బాబాయినంటూ వచ్చిన ఆ తుమ్మమొద్దుశాల్తీతో పంపిస్తానంటున్నాడే" అంది సుజాత ఏడుపు గొంతుతో. విమల పరిస్థితీ యించుమించు యిలాగే వుంది. "ఇక్కడి వ్యవహారం చూస్తూంటే యింతకంటే బొంబాయిలోని ఫకీరుగాడే బెటరనిపిస్తోంది... ఆ రాగిణీదేవి మాటలు నమ్మి మన జీవితాలు బాగుపడతాయన్న భ్రమతో వచ్చాం. ఆ మహాతల్లి మనల్ని మరోకూపంలోకి తోస్తున్నట్లుంది యిప్పుడు" అంది విమల.

"అలాగని మళ్లీ ఆ నరకంలోకి వెళతామా... ధైర్యంగా పోరాడుదాం. మన మార్గం మనం చూసుకుంటామని చెబుదాం. ఇక్కడ మనకి ఎవరి వత్తాసువున్నా లేకున్నా పత్రికల సాయం వుంది. వారితోనే యిక్కడ జరుగుతున్న లుకలుకల గురించి చెబుదాం." అంది రమణి ఆవేశంగా.

"చెబితే... వారవి పేపర్లో వేస్తారు... అప్పుడు మనల్ని విడిచిపెడతారు... మనం ఈ సంఘంలోనే... వీరి మధ్యనే బ్రతకాలి... అవునా... ఎవరిస్తారు ఉద్యోగం మనకి... ఏ ఉద్యోగం చేస్తాం... అందుకు కొంత శిక్షణ కావాలి. అది పొందే అవకాశం యిచ్చే శిక్షణాలయాల్లో చేరడం ఎలా... మళ్లీ అక్కడా చరిత్ర పునరావృతం కాదన్న నమ్మకం ఏమిటి..." అంతకన్న ఆవేశంగా అంది విమల.

"ఏమిటీ... విప్లవ నాయకురాలిలా మాట్లాడుతున్నావు... విప్లవం లేవదీస్తున్నావా?" మొరటుగా వినిపించిన కంఠం విని ఉలిక్కిపడి వెనక్కి తిరిగి చూశారు నలుగురు.

భారీకాయం ఒకటి పళ్లికిలిస్తు నిలబడి వుంది, కంచే చేనుమేసే విధంగా.

"ఏదో ఉద్ధరిద్దామనే పెద్దవాళ్ళు మిమ్మల్నిక్కడికి తెచ్చారు. ఇంకో నాలుగొందలమంది ఇవాళో రేపో... మీలాంటి వాళ్లే రైలు దిగుతున్నారని తెలియగానే... యింతమందిని ఏం చెయ్యాలో ఎలా సంస్కరించాలో తెలియక తోకముడిచారు. మరి మీ తలిదండ్రులకు, అత్తమామలకు అప్పగించాలికదా మిమ్మల్ని... ఆ పని మా కప్పగించారు. పాపం మీరు మాత్రం ఎంతకాలం ఈ శిబిరంలో జంతుప్రదర్శనశాలలో జంతువుల్లా చూపరులకి నేత్రానందం కలిగిస్తారు చెప్పండి. అందుకే రేపు ఉదయమే బ్యాచి ... బ్యాచిలుగా మీ 'వాళ్లకి' మిమ్మల్నిప్పగించే కార్యక్రమం ప్రారంభమవుతుంది... అమ్మాయ్ నీ పేరిమిటన్నావ్... అప్పుడప్పుడు వచ్చి చూసిపోతూంటాలే... యిక్కడైతే అల్లరవుతుందిగా" అన్నాడు రమ్యవైపు చూసి పళ్లికిలిస్తూ.

ఠారెత్తిపోయారు నలుగురూ.. "ఇది అన్యాయం... మోసం" అరిచింది రమణి.

"ఛత్ నోర్ముయ్" అని ఒక్క తాపు తన్నాడు భారీకాయం. రమణి డొక్కలో విపరీతమైన నెప్పి. 'అమ్మా', అని మూలిగింది. "జాగ్రత్త... తాటవలిచేస్తాను" వెళ్లిపోయాడతను.

"లాభంలేదు - అనుకున్నదొకటి... జరిగింది మరొకటి... ఇక్కణ్ణించి బయటపడాలి." అంది విమల.

"రాగిణిదేవిని కలిస్తేనో"

"ఈ దుర్మార్గం ఆవిడకు తెలిసి వుండకపోవచ్చు. కానీ ఆవిడవల్ల మనకు అంతగా ఉపయోగం వుండకపోవచ్చు. మనం తిరిగి వెళ్లిపోవడమే మంచిదనిపిస్తోంది." అంది రమ్య.

"అవును... పొయ్యినుంచి పెనంలో పడినట్లుంది మన పరిస్థితి" అంది సుజాత.

"ఈ సంఘమే యింత" అంది విమల కసిగా.

"సంఘం అంటూ విడిగా లేదు... మనందరం... ఈ మనుషులూను... కొందరు వ్యక్తులవల్ల మనం దారి మళ్లాం. కొందరు వ్యక్తులు మనల్ని దారిలో పెడదామనుకున్నారు. కానీ అది వారు పూర్తి విశ్వాసంతో చేపట్టిన చర్యకాకపోవడంతోనే వచ్చింది చిక్కు మనకి. మనం మరోసారి మనుషుల్ని నమ్మాం. కాకపోతే ఈసారి కాస్త భిన్నమైన మనుషులు... మంచి మాటలు చెప్పి మోసం చెయ్యాలనుకున్న వాళ్లు కారు. మంచి చెయ్యబోయి చేతకాక మధ్యలో మన ఖర్మకి మనల్ని వదిలేసినవాళ్లు... అందుకే వాళ్లకీ వీళ్లకీ తేడా ఏంలేదు. పలాయనవాదంగా అనిపించినా ఈ కొత్తనరకం కన్న ఆ పాతనరకమే మేలని." అంది రమణి నిర్వేదనగా.

ఆ రాత్రే నలుగురూ తప్పించుకున్నారు. వారి వెనుక మరికొందరు రైలెక్కారు. అదే రైలు... ఓ ప్రాతఃకాలం పూలదండల ఆశల ఊసులతో వచ్చిన రైలు. ఎలాంటి ఆర్భాటమూ లేకుండా చీకట్లోకి జారిపోయింది. ★



**నర్తకి**

**పద్మప్రియ**

శ్రీమతి పద్మప్రియ (30) తన 5వ యేట నుండి కూచిపూడి నృత్యం నేర్చుకోవటం ఆరంభించింది. శ్రీచిట్టాసీతారామాంజనేయులు, దగ్గర ప్రారంభించి, శ్రీ వేదాంతం ప్రహ్లాదశర్మ, శ్రీ వెంపటి చినసత్యంగార్ల దగ్గర కూచిపూడి నృత్యంలో పలు అంశాలను నేర్చుకొని ప్రస్తుతం విజయవాడలో శ్రీ భాగవతుల వెంకటరామశర్మ దగ్గర నేర్చుకుంటోంది. భర్త డా॥ కె. ప్రశాంత్ కుమార్, (యూరాలిజిస్ట్) వృత్తిరీత్యా 7 సంవత్సరాలు బెంగుళూరులో ఉండి, 3 సంవత్సరాల క్రితం విజయవాడలో స్థిరపడ్డ పద్మప్రియ ఇద్దరు పిల్లలకు తల్లి అయినా భర్త ప్రోత్సాహంతో, యిప్పటివరకు గుడివాడ, ఏలూరు, విజయవాడ, కోయంబత్తూరు తదితర ప్రాంతాలలో 40 కార్యక్రమాలవరకు ప్రదర్శించి డా। వెంపటి చినసత్యం, వేదాంతం సత్యనారాయణశర్మ, వావిలాల గోపాలకృష్ణయ్య, తదితర ప్రముఖుల ప్రశంసలు పొందింది. పద్మప్రియ కోయంబత్తూరులో యం.ఎస్.సి (హోం సైన్సు) చదివింది. ఆమె నృత్య కార్యక్రమం విజయవాడలో కృష్ణా పుష్కరాల సందర్భంగా "కళా స్రవంతి" సంస్థవారు యేర్పాటు జేసారు.

— జి. మాధవీరెడ్డి